
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 17 ఏప్రిల్ 2025


బిలాల్‌పూర్‌లో దెబ్బతిన్న బొప్పాయి పంట

హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన

నిరసన దీక్షలో నిర్మలాజగ్గారెడ్డి

కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు పెడితే ఖబడ్దార్





సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేంద్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసన దీక్షలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత వీహెచ్ హనుమంతరావుతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి ఈడీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, లేదంటే దేశ వ్యాప్తంగా నిరసన చేపడుతామని హెచ్చరించారు.





కోహీర్ కురుస్తున్న వర్షం, బిలాల్‌పూర్‌లో పడిన వడగండ్లు

కోహీర్‌లో వడగండ్ల బీభత్సం

కోహీర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం భిన్నవాతావరణానికి నెలవుగా మారింది. శీతాకాలంలో రాష్ట్రంలోనే రికార్డుస్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదై చలి వణికించింది. వేసవిలోనూ నిన్నటి వరకు ఎండలు సుర్రుమనిపించాయి. ఇక బుధవారం ఏకంగా వడగండ్ల వాన కురిసింది. మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు బిలాల్‌పూర్, పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలలతో కూడిన వడగండ్ల వర్షం బీభత్సాన్ని సృష్టించింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే మూడున్నర గంటల సమయంలో 20 నిమిషాల పాటు గాలివాన కురిసింది. దీంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైనా ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మండలంలోని బిలాల్‌పూర్‌లో భారీగా పడిన వడగండ్లకు బొప్పాయి, అరటి పంట దెబ్బతిన్నది.

చిన్నారుల జీవితాల్లో 'ఇంద్రధనుష్'

మూడు విడతల్లో వ్యాధినిరోధక టీకాలు
డ్రాపౌట్ చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సినేషన్
కార్యాచరణ రూపొందించిన వైద్య ఆరోగ్య శాఖ



సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడంలో ఇప్పటికీ సరైన అవగాహన ఉండటం లేదు. ఫలితంగా పిల్లలు భవిష్యత్తులో వివిధ రోగాల బారినపడి, వారి జీవితాలు అంధకారంగా మారే ప్రమాదం పొంచి ఉంది. అందుకే ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులు, గర్భిణుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కింద మిషన్ ఇంద్రధనుష్ (ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్-ఐఎంఐ-ఇమ్యూనైజేషన్ క్యాచ్ అప్ క్యాంపెయిన్) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఐదేళ్ల లోపు ఉన్న ప్రతీ చిన్నారితో పాటు గర్భిణులకు అవసరమైన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను ఒకే దఫాలో ఇవ్వాలన్నదే మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ఉద్దేశం.

డ్రాపౌట్స్ సర్వే

వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించకపోవడం కారణంగా క్షయ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, కామెర్లు, మెదడువాపు, న్యూమోనియా వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి వ్యాధులు ప్రబలి చాలామంది చిన్నారులు, గర్భిణులు చనిపోతున్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. దీని నివారణకు పాక్షికంగా కొన్ని టీకాలు వేయించుకున్న వారే కాకుండా అసలే వేయించని వారికి ఒకేసారి ఇవ్వడం ద్వారా ఆరోగ్యానికి భరోసా దక్కనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు టీకాలు వేసుకోని వారెందరున్నారో(డ్రాపౌట్స్) అనే కోణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

మూడు విడతల్లో వ్యాధి నిరోధక టీకాలు

డ్రాపౌట్స్‌ను పూర్తిస్థాయిలో గుర్తించి వందశాతం టీకాలు వేయించేందుకుగాను జిల్లాలో మూడు విడతల్లో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమ ప్రణాళికను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రూపొందించారు. ఈ నెల 21 నుంచి 26 వరకు, మే 21 నుంచి 28 వరకు, జూన్ 23 నుంచి 30 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఆయా విడతల్లో డ్రాపౌట్స్‌కు బీసీజీ, పోలియో, పెంటా(డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటానస్, హెపటైటిస్-బీ, హెచ్ఐబీ), మీజిల్స్ రూబెల్లా, పీసీవీ, రొటావైరస్(డయేరియా), జేఈ ఇలా ఏడు రకాల టీకాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పీహెచ్‌సీ, సబ్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బుధ, శనివారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలో చిన్నారులు, గర్భిణులు ఎక్కడైనా ఆయా టీకాలు మిస్ అయిన వారు ఉంటే ఈ ప్రత్యేక డ్రైవ్‌లో టీకాలు వేయించుకోవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మెదక్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల్లో ఆశించినస్థాయిలో పథకం ముందుకు వెళ్లడం లేదు. ఇప్పటివరకు 90 శాతం ఇళ్లకు గుంతలే తియ్యలేదు. గుప్పెడు మట్టి కూడా పోయలేదు. దీనికి ప్రధాన కారణం లబ్ధిదారుల ఆర్థిక కష్టాలే. ఓవైపు ప్రభుత్వం పునాది స్థాయి వరకు నిర్మించిన వాటికి మొదటి విడతగా రూ.లక్ష అందిస్తుంటే జిల్లాలో మాత్రం అర్హత పొందినవి పది శాతం కూడా లేవంటే ఏమేరకు నిర్మాణాలు కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.


చేగుంట మండలం జక్రా తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికై పోసిన ముగ్గు

గుంత తియ్యలే.. గుప్పెడు మట్టి పోయలే..!

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక కష్టాలు

పైలెట్ గ్రామాల్లో లేవని పునాదులు
పేద కుటుంబాలకు లేని స్థోమత

మెదక్ జిల్లాలో వివరాలు

మొదటి దశలో ఇళ్లు	1339
ముగ్గు పోసినవి	318
బేస్‌మెంట్ స్థాయిలో	62
నిర్మాణాలు ప్రారంభం కానివి	256


రేగోడ్ మండలం గజవాడ తండాలో పూర్తయిన బేస్‌మెంట్

మెదక్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల కోసం మెదక్ జిల్లాలో సుమారు లక్షా 90 వేల దరఖాస్తులు వచ్చాయి. అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి అసలైన లబ్ధిదారులను గుర్తించారు. వారిలో సొంత స్థలం ఉండి, ఇల్లు లేని వారిని ఎల్-1 విభాగంలో, స్థలం లేని వారిని ఎల్-2లో, పక్కా గృహాల్లో వేరే కారణాలతో ఉన్న వారిని ఎల్-3లో చేర్చారు. వీటిలో ఎల్-1 విభాగమైన స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకున్నది. దీని కోసం మండలానికి ఒక గ్రామం చొప్పున పైలెట్ గ్రామాలను ఎంపిక చేశారు. తొలి విడతగా జిల్లాలో 21 మడలాల్లో ఆయా గ్రామాల్లోని 1339 ఇళ్లను నిర్మించాలని అధికారులు నిర్ధారించారు. అయితే ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి వెనకడుగు వేస్తున్నారు.

పది శాతం కూడా దాటలే..

మెదక్ జిల్లాలో మొదటి దశలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారు 10 శాతం కూడా లేరు. పైలెట్ గ్రామాల్లో 318 మంది లబ్ధిదారులకు అనువైన స్థలాలలో ఇంటి నిర్మాణాలకు హౌజింగ్ శాఖ మార్కింగ్ (ముగ్గు) చేసింది. అందులో 256 మంది ఇప్పటికీ నిర్మాణాలే చేపట్టకపోవడం గమనార్హం. ప్రస్తుతం 62 మంది

మిగతా 8వ పేజీలో

కొన్ని పైలెట్ గ్రామాల్లో పరిస్థితి..

కొల్చారం మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన పోతిరెడ్డిపల్లిలో 75 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 15 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మనోహరాబాద్ మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి పైలెట్ గ్రామంలో 41 మందికి ఇళ్లు మంజూరు కాగా, నలుగురు మాత్రమే బేస్‌మెంట్ లెవెల్ వరకు నిర్మాణాలు పూర్తి చేశారు. శివంపేట మండలం శభాష్‌పల్లి పైలెట్ గ్రామంలో 48 మందిని ఎంపిక చేయగా, ఐదుగురే బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం చేశారు.

అంత డబ్బు లేదు



నేను ఒంటరి మహిళను. ఉపాధి హామీ కూలి పనులు చేస్తూ పొట్టపోసుకుంటాను. నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి పునాది దశకే రూ.లక్ష వరకూ వెచ్చించాల్సి వస్తోంది. వారం రోజుల క్రితం ఎంపీడీవో సార్ గ్రామానికి వచ్చి ఇళ్లు మంజూరైన వారు తప్పక ఇల్లు నిర్మించుకోవాలని చెప్పారు. నా దగ్గర అంత డబ్బు లేదు. నా కూలీ డబ్బులు ఇంటి అవసరాలకే సరిపోతయి. అప్పు కూడా ఎవ్వరూ ఇవ్వడానికి ముందుకు రావడం లేదు.

- బాలమణి, ఉపాధి కూలీ, ముప్పిరెడ్డి పల్లి, మనోహరాబాద్ మండలం

డబ్బులు ఇస్తేనే ఇల్లు కట్టుకుంటా..



ఏళ్ల తరబడి పూరి గుడిసేలో నివాసం ఉంటున్నాం. కాంగ్రెస్ సర్కార్ నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. సొంత స్థలంలోనే ఇల్లు కట్టుకునేందుకు ముగ్గు పోయించా. మా తాండాలో ఇప్పటికి 30 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. డబ్బులు మంజూరి అయితే నేను కూడా ఇంటి నిర్మాణం ప్రారంభిస్తా.

- మాలోత్ మంగ, జత్రం తండా, చేగుంట మండలం

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి 7

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు
కేఎస్‌పీపీలో పట్టాల ప్రదానోత్సవం
ఇస్నాపూర్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న కేంద్ర మంత్రి


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు మెమెంటో అందజేస్తున్న గీతం అధ్యక్షుడు భరత్

ఉత్సాహంగా టెక్నో ఫెస్ట్ 7

ఆలోచింపజేసిన సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ విద్యార్థుల ప్రదర్శనలు

పోషకాహార లోపాలను అరికట్టాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

పుల్‌కల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపాలను అరికట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చౌటకూర్ మండలం శివంపేట జిల్లా పరిషతు ఉన్నత పాఠశాలలో బుధవారం పోషణ పక్షం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలలకు పోషణ లోపం లేకుండా చూడాలన్నారు. గర్భందాల్చిన మొదటి రోజు నుంచి రెండేళ్ల వరకు(వెయ్యి రోజులు) మంచి పౌష్టికాహారం అందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెలలో రెండో, నాలుగో శుక్రవారం తల్లికి, కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు.

'భూ భారతి'పై అవగాహన కల్పించాలి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంపై ఈ నెల 30 వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవోలు, తహసీల్దార్లతో బుధవారం సమీక్షించారు.

'ఆంధ్రజ్యోతి' విజేతలకు బహుమతులు



మూడో బహుమతి విజేతగా నిలిచిన ఎం.చెన్నయ్యకు 32 ఇంచుల టీవీ అందజేస్తున్న డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి



రెండో బహుమతి విజేతగా నిలిచిన గాదిరాజ్ రవిచంద్రకు ఫ్రిజ్ అందజేస్తున్న డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి

'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా కార్ అండ్ బైక్ రేస్ హైదరాబాద్ యూనిట్ డ్రాలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. రెండో బహుమతి విజేతగా నిలిచిన గాదిరాజు సువర్ణ లక్ష్మి తరపున ఆమె కుమారుడు గాదిరాజ్ రవిచంద్రకు ఫ్రిజ్ (రిఫ్రిజిరేటర్), మూడో బహుమతి విజేతగా నిలిచిన ఎం.చెన్నయ్యకు 32 ఇంచుల టీవీని 'ఆంధ్రజ్యోతి' తరపున డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి అందజేశారు.

- హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి)


చిన్నారిని ఒడిలో కూర్చోబెట్టుకుని అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్ క్రాంతి

ద్విచక్రవాహనం చోరీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రభవన్ హోటల్ వద్ద రాత్రి బైక్(టీఎస్35టీ1943)ను ఇద్దరు దొంగలు ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుల దృశ్యాలు నమోదు కావడంతో వారి ఆచూకీ కోసం పట్టణ పోలీసుల దొంగల ఫోటోలను విడుదల చేశారు. బైక్ దొంగలించిన వ్యక్తుల గురించి తెలిస్తే.. 8712657913, 8712657878 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ నాగరాజు సూచించారు.

బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోచయ్య మృతి

● ఎమ్మెల్యే రోహిత్‌రావు సంతాపం

రామయంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రొయ్యల పోచయ్య(70) కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం ఇంట్లోనే మరణించారు. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో ఎన్నో పదవులు పొందిన ఆయన నిస్వార్థంగా పనిచేశారు. మొదట్లో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, తరువాత మండల యూత్ అధ్యక్షుడిగా, వార్డు సభ్యుడిగా, పీఏసీఎస్ ఛైర్మన్‌గా కొనసాగారు. పదేళ్లుగా బ్లాక్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. పోచయ్య మృతిపై మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కోటి యుగంధర్ సంతాపం ప్రకటించి.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు.


రొయ్యల పోచయ్య(ఫైల్)

గుండెపోటుతో పీఏసీఎస్ ఛైర్మన్ కన్నుమూత

కొల్చారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కొంగోడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కృపాకర్‌రెడ్డి(47) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌లో పని చేస్తున్నారు. కొన్ని రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, వేమారెడ్డి, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.


కృపాకర్‌రెడ్డి (ఫైల్)

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కోహెడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన పొన్నాల నర్సయ్య(49) ఇంటి నిర్మాణానికి వినియోగించే సెంట్రింగ్ కర్రలు కిరాయికిస్తూ, మేస్త్రి పని చేసుకుంటూ కుటుబాన్ని పోషిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా కర్రలకు సరిగా గిరాకీ లేకపోవడంతో అమ్ముకున్నాడు. మేస్త్రీ పని సైతం దొరకకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా కుటుంబ సభ్యులు కాపాడి అప్పులు ఎలాగైనా తీర్చుకుందామని ఓదార్చారు. అయినప్పటికీ తీవ్ర మానసిక ఆందోళనతో నర్సయ్య ఈ నెల 14న చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో చేసిన పనికి డబ్బులు వసూలు చేయడానికి వెళ్తున్నాని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. బస్వాపూర్ గ్రామంలో గుండె కనకయ్య వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు బుధవారం గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఉన్నందున ఇంటి నుంచి వెళ్లిన రోజే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎలక్ట్రికల్ వైర్ చోరీ ముఠా అరెస్ట్

● రూ.2.2లక్షల విలువైన సామగ్రి స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడి

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసై ప్రైవేట్ వెంచర్లలో కరెంట్ వైర్ల దొంగతనాలకు పాల్పడే ముఠా గుట్టును జిల్లా పోలీసులు రట్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.2.2లక్షల విలువైన అల్యూమినియం ఎలక్ట్రికల్ వైరు, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం దమర్‌పూర్‌కు చెందిన ముఖేష్ పత్రిదా(27), రవిరంజన్ కుమార్(21), దినేష్ కుమార్‌సహని(20), మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లికి చెందిన సాగర్ పవార్(25), బీహార్‌లోని చాప్రాకు చెందన రంజయ్ కుమార్ రామ్(20), ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లా, దరియాపూర్ థానేకు చెందిన అమిత్‌పాండే (30), బీహార్ రాష్ట్రం అఖిల్‌పూర్‌కు చెందిన వినయ్‌కుమార్ రామ్ (18), హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన శైలేష్(25), రవిశంకర్ సింగ్ (47)లతో పాటు మరో నలుగురు నిందితులు ఒక ముఠాగా ఏర్పడి గత కొన్ని సంవత్సరాలుగా సుభాష్‌నగర్, జీడిమెట్ల, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి మద్యం, గంజాయి సేవించడం వంటి అలవాట్లున్నాయి. జల్సాలకు డబ్బు సరిపోక దొంగతనాలకు పాల్పడటం మొదలుపెట్టారు. ఒడిస్సాకు చెందిన హరి, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌తో కలిసి కరెంట్ సరఫరా లేని వెంచర్లలో స్తంభాలకు ఉన్న అల్యూమినియం ఎలక్ట్రిక్ వైర్లను దొంగతనం చేసి స్క్రాప్ షాప్‌లలో విక్రయించేవారు. ఇలా సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలం అంకెనపల్లిలో ఉన్న ఓ వెంచర్‌లో, నందకంది, ఆత్మకూర్ గ్రామ శివార్లలో, హత్నూర, ఇంద్రకరణ్, జిన్నారం, సంగారెడ్డి రూరల్ తదితర శివారులలో ఉన్న వెంచర్లలో అల్యూమినియం వైర్లను దొంగిలించారు. ఈ మేరకు జిల్లా ప్రత్యేక పోలీసు బృందాలు, సీసీఎస్ పోలీసులు బుధవారం సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలో 13 మంది ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.2లక్షల విలువైన 778 కిలోల అల్యూమినియం ఎలక్ట్రికల్ వైరు, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్, రాము నాయుడు తదితర సిబ్బందిని జిల్లా ఎస్పీ పంకజ్ అభినందించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

టేక్మాల్ ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మోటర్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మణ్‌తండాకు చెందిన కంట్రోత్ పోమ్లా(55) మంగళవారం రాత్రి జోగిపేట- కొత్తపల్లి ప్రధాన రహదారిపై ఉన్న వడ్ల కుప్పల వద్ద ఉన్నాడు. అదే సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి అతడిని బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన పోమ్లాను చికిత్స నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ తెలిపారు.


కంట్రోత్ పోమ్లా(ఫైల్

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..

అక్కన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇసుక తీసుకువస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామానికి చెందిన లింగాల భాను(23) నంగునూరు మండలం ఖాతా వాగు నుంచి గ్రామానికి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నాడు. అప్పటికే నాలుగు ట్రిప్పులు తరలించి, మరో ట్రిప్పు ఇసుకను తీసుకవస్తుండగా ప్రమాదవశాత్తు గ్రామ శివారులో కల్వర్టులో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయిన భాను మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడి చేరుకుని జేసీబీ సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


భాను(ఫైల్)

సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలు

● ఇద్దరు నిందితుల అరెస్ట్


పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలు పెట్టిన ఇద్దరు నిందితులను సంగారెడ్డి రూరల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన అరుణ్ యాదవ్, కొండాపూర్ మండలం ఉత్తర్‌పల్లికి చెందిన లల్లూ యాదవ్‌లు ప్రముఖుల ఫొటోలు క్రియేట్ చేసి ఇన్స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో వివిధ సంఘాల నాయకులు సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఫేక్ ఫోటోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆయా సంఘాలు ఆందోళన విరమించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

అంబేద్కర్ ఫొటోను మార్ఫింగ్ చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

జోగిపేట రూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఫొటోను కొంతమంది దుండగులు మార్ఫింగ్ చేసి కించపరచడంపై దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. వారిపై చట్టరీత్యా చర్యలు తిసుకోవాలని అందోల్ మండల దళిత సంఘాల నాయకులు ఎస్ఐ పాండుకు వినతి పత్రాన్ని అందజేశారు.

బురద రోడ్డులో పడి పలువురికి గాయాలు


బురద రోడ్డులో జారీ పడిపోయిన ద్విచక్ర వాహనాలు వాహనాలు

కోహీర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన కోహీర్‌లోని రైల్వే లైన్‌కు పక్కన గల పొలాలకు వెళ్లే దారిలో పడి పలువురికి గాయాలయ్యాయి. కోహీర్ సమీపంలోని 24వ రైల్వే గేటు వద్ద గత 13వ తేదీన రైల్వే ట్రాక్ మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. దీంతో రైల్వే గేట్‌ను మూసివేయడంతో ప్రత్యామ్నాయ మార్గంమైన రైల్వే లైన్ పక్కన ఉన్న పొలాలకు వెళ్లే దారిని గుండా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అయితే బుధవారం మూడున్నర గంటల సమయంలో కోహీర్‌లో భారీగా వర్షం కురవడంతో పొలాలకు వెళ్లి ఆ దారి పూర్తిగా బురదమయం కావడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడిపోయాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న మహిళలు చిన్న పిల్లలు ద్విచక్ర వాహనాలపై నుంచి జారిపడిపోయి గాయాలపాలయ్యారు. రైల్వే ట్రక్ మరమ్మత్తు పనులు పూర్తయింతవరకు తాత్కాలికమైన రోడ్డును పకడ్బందీగా ఏర్పాటు చేసి ఉంటే ఇలా జరిగేది కాదని పలువురు పేర్కొన్నారు.

మామిడి చెట్టు వద్ద మూడు ముక్కలాట

శివ్వంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బుధవారం ఓ మామిడి చెట్టు వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని చండీ గ్రామంలో ఆలయ సమీపంలో ఓ మామిడి చెట్టు వద్ద మూడు ముక్కలాడుతున్నారనే సమాచారంతో దాడి చేసి 1620 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న శివన్న గారి శివుడు, గడ్డమీది శ్రీశైలం, సంధి గాని నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ చేపట్టవచ్చని పెద్దశంకరంపేట అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్‌వో శ్రీశైలం అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి పాఠశాలల్లో పబ్లిక్ ప్రాంతాల్లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పేట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఎల్ఎఫ్ ధర్మ, డీవోపీ బంగారయ్య, ఎఫ్ఎం రాజశేఖర్, సాయికిరణ్, రమేష్, పేట వైద్యాధికారి షర్ఫోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన స్మార్ట్ సిటీ నమూనా



బ్యాటరీతో నడిచే రేసింగ్ కారును ప్రదర్శిస్తున్న మెకానికల్ విద్యార్థులు



రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని వివరిస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా టెక్నో ఫెస్ట్

● ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు

పుల్‌కల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 13వ టెక్నో 2కె25 ఫెస్ట్ కొనసాగుతున్నది. బుధవారం కళాశాలలోని సీఎస్ఎస్సీ, ఈసీఈ, సివిల్, మెకానికల్ విభాగాలకు సంబంధించి టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టుల ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ఎలాంటి ఖర్చు లేకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడేలా బ్యాంబో బ్రిడ్జి (వెదురు కర్రల వంతెన), నీటి శుద్ధి కేంద్రం, స్మార్ట్ సిటీ, భూకంపాలను తట్టుకునేందుకు వీలుగా ఎర్త్ క్విక్ రెసిస్టెంట్ బిల్డింగ్ వంటి నూమూనాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. ఆటపాటలు, గీటారు వాయించడం, తరగతి గదులను అందంగా అలంకరించడం వంటి కార్యక్రమాలతో ఫెస్ట్ ఉల్లాసంగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ప్రొఫెసర్లు రజనేష్, జోషీ, విజయ్‌కుమార్ ప్రాజెక్టులను పర్యవేక్షించారు. గురువారం రాత్రి జరిగే ఫెస్ట్ ముగింపు ఉత్సవాలకు హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం

● సర్టిఫికెట్ జారీలో తీవ్ర జాప్యం ● కంటతడి పెట్టిన బాలిక



తహసీల్దార్ కార్యాలయంలో కన్నీరు పెడుతున్న బాలిక

కోహీర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సర్వర్ పని చేసినప్పుడు కరెంటు ఉండదు.. కరెంట్ ఉంటే సర్వర్ పనిచేయదు.. ఈ రెండూ ఉంటే అధికారులు ఉండరు.. ఇది కోహీర్ తహసీల్దార్ కార్యాలయ దుస్థితి. ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా వివిధ ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా డెత్, బర్త్ సర్టిఫికెట్లు, ఆర్డీవో ప్రొసీడింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం ఓ బాలిక ధ్రువపత్రాల కోసం వచ్చి కంటతడి పెట్టడమే ఇందుకు నిదర్శనం. కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామానికి చెందిన బాలిక గోపిక తన తండ్రి, మేనమామల మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవాలో దరఖాస్తు చేసి చేసి రెండు వారాల క్రితం కోహీర్ తాహసీల్దార్ కార్యాలయంలో ఫైల్ అప్పగించింది. అప్పటినుంచి రేపిస్తాం.. ఎల్లుండిస్తామంటూ అధికారులు కాలయాపన చేస్తూ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. బుధవారం కూడా ఎండకు ఆపసోపాలు పడుతూ కార్యాలయానికి చేరుకున్న బాలికకు సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో కన్నీరు పెట్టింది. తన బాధను వినేవారే లేరని బోరున విలపించింది. ఇప్పటికైనా అధికారుల పనితీరులో మార్పు వచ్చేలా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని పలువురు కోరారు.

బస్సు వచ్చేదాకా ఎండలోనే..

● బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్న ఏడుపాయల భక్తులు



ఏడుపాయలకు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కన మండుటెండల్లో బస్సు కోసం ఎదురుచూస్తున్న భక్తులు

కొల్చారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయలకు నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులోని ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటర్నర దూరంలో ఆలయం ఉంటుంది. బస్సుల్లో వచ్చే భక్తులు ఇక్కడే దిగి ఆలయానికి వెళ్లడం, తిరుగుప్రయాణంలోనూ ఇక్కడే బస్సు ఎక్కి వెళ్తుంటారు. సంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ దారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రహదారి వద్ద కనీసం బస్ షెల్టర్ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వచ్చేదాకా మండుటెండల్లోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొన్నది. భక్తుల సౌకర్యార్థం ఇక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను పలువుమార్లు కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాన నానుతూ, ఎండకు ఎండుతూ నరకయాతన పడుతున్నామని భక్తులు వాపోతున్నారు. ముఖ్యంగా భక్తులు రోడ్డు పక్కన నిలబడడంతో జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదమూ ఉన్నది. ఇప్పటికైనా ఆలయ కమిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రెండు వైపులా బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన కేంద్ర బృందం



గజ్వేల్ : అక్కారంలో ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గజ్వేల్/చేర్యాల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటలను కేంద్ర బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పొన్ను స్వామి, అడిషనల్ డైరెక్టర్ హర్టికల్చర్ సరోజిని దేవీలు గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, బూర్గుపల్లి, కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. వారికి జిల్లా హర్టికల్చర్ అధికారి సువర్ణ ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి సంతృప్తి కలిగిందన్నారు. జిల్లా అధికారి సువర్ణ మాట్లాడుతూ జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి 6,66,546 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో 12,339 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని తెలిపారు. 329మంది రైతులు 322.83 టన్నుల దిగుబడి సాధించారని, రెండు ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జూన్ మొదటి వారంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.21వేలు ఉందని, రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని కోరారు. తక్కువ పరిధిలో చీడపీడల బాధ లేకుండా ప్రభుత్వ రాయితీతో డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వారి వెంట ఉద్యానవన అధికారులు రమేశ్, కౌసల్య, బాలాజి, విజయకృష్ణ, ఆయిల్‌ఫెడ్ అధికారులు భాస్కర్‌రెడ్డి, శంకర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగుల కష్టాలకు అండగా సర్కారు

● సంగారెడ్డిలో టీఎన్‌జీవో భవనానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుకూలంగా ఉందని టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో టీఎన్‌జీవో భవన నిర్మాణానికి బుధవారం ఆయన సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిల విషయంలో కేంద్ర సంఘం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. స్థల కేటాయింపుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం టీఎన్‌జీవో సంఘానికి కేటాయించిన స్థల పత్రాలను అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్ దేవీదాస్ సంఘం నేతలకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన సేవలు అందించాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెల వారి నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేపప్పుడు ఏ విధంగా చేయాలి..ఏ ఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాలపై వివరించారు. ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకత, ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధుల నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ.. ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డయల్ 100, సైబర్ క్రైం వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు, అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

● కేంద్ర మంతి కింజారపు రామ్మోహన్‌నాయుడు

● కేఎస్‌పీపీలో పట్టాల ప్రదానోత్సవం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు

పటాన్‌చెరు రూరల్, ఏప్రియల్ 16 (అంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అభిలషించారు. జాతీయంగా, ప్రపంచవ్యాప్తం ప్రజావిధాన రూపకల్పలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రతిష్టాత్మక కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్‌పీపీ) తృతీయ పట్టభద్రుల దినోత్సవాన్ని బుధవారం హైదరాబాద్ గీతం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. 'మీరు వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, సమాజంలో అర్థవంతమైన మార్పును సృష్టించే జ్ఞానం, విలువలు, ఉద్దేశాన్ని మీతో తీసుకెళ్లండి' అని ఉద్బోధించారు. పౌర విమానయాన శాఖ మంత్రిగా తన పాత్రను వివరించారు. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 160కి పెరగడం, స్థిరమైన రెండంకెల సీఏజీఆర్‌తో విమానయాన రంగం అద్భుతమైన వృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. గీతం అధ్యక్షులు, విశాఖపట్టణం పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీ భరత్ తన అధ్యక్షోపన్యాసంలో పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథి రామ్మోహన్ నాయుడును శ్రీభరత్ సత్కరించగా, కేఎస్‌పీపీ సహా వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ సభకు పరిచయం చేశారు. ఈ ఏడాది 30 మంది విద్యార్థులకు పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలను ఇచ్చి సత్కరించారు. పలువురికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేఎస్‌పీపీ డీన్, ఐక్యరాజ్య సమితిలో భారతదేశ పూర్వ శాశ్వత ప్రతినిధి ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న కేంద్రమంత్రి

గీతం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తిరిగి వెళ్తుండగా సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ముత్తంగి చర్చి ప్రాంతంలో మంత్రి వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో పైలెట్ వాహనంతో పాటు స్థానిక పోలీసు వాహనాలు కొద్ది కొద్దిగా ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకుంటూ ముందుకు సాగాయి. ఎట్టకేలకు మంత్రి వాహనం ముత్తంగి రింగ్ రోడ్డు వరకు వచ్చి రింగ్ రోడ్డు పైనుంచి వెళ్లిపోయింది.



గ్రీన్ హైవేస్ కేటగిరిలో డీటీఎల్‌కు అవార్డు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా అవార్డును అందుకున్న టోల్‌వేస్ ప్రతినిధులు

మునిపల్లి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ హైవేస్ కేటగిరిలో డెక్కన్ టోల్‌వేస్ లిమిటెడ్ (డీటీఎల్)కు రజత అవార్డు దక్కింది. రహదారుల నిర్మాణం, నిర్వహణ ప్రక్రియలో వాటాదారులను గుర్తించి ప్రొత్సహించేందుకు కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చేపట్టిన ఎన్‌హెచ్‌ఈఏ చొరవతో అవార్డు లభించగా, ఈ నెల 15న రోడ్డు రవాణా, రహదారుల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీటీఎల్ ప్రాజెక్టు హెడ్ రాజేష్ విచారే మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ, రాష్ట్రాలోని ఎన్‌హెచ్-65, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు నుంచి తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి విభాగానికి రాయితీదారుగా డీటీఎల్ ప్రాజెక్టు ఉన్నదన్నారు. హైవేపై చేపడుతున్న పచ్చదనం, పునరుత్పాదక ఇంధన సృష్టి, పరిశుభ్రత, నీటి సేకరణ, మొక్కలు నాటడం, నీటి నిర్వహణ తదితర సౌకర్యాలు కల్పించినందుకు ఈ అవార్డు దక్కిందని తెలిపారు.

సిద్దిపేటలో అతిపెద్ద జైన విగ్రహం

● పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

● అరుదైన ప్రతిమను కాపాడుకోవాలని పిలుపు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అతి పెద్దదైన వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి సూచించారు. బుధవారం సిద్దిపేట జిలా నంగునూరులోని చిన్న కొండపైన నెలవైన జైన శిల్పాన్ని పరిశీలించారు. మహావీర శిల్పం, తలపై ఉష్ణీష చిహ్నంతో రాష్ట్రకూటుల కాలపు (క్రీ.శ. తొమ్మిదవ శతాబ్ది) జైన తీర్థంకర ప్రతిమాలక్షణానికి అద్దం పడుతుందని శివనాగి రెడ్డి చెప్పారు. నంగునూరు 11 వందల సంవత్సరాల నాటి జైన కేంద్రమని, అక్కడొక జైనబసది ఉండేదని పేర్కొన్నారు. తొమ్మిది అడుగుల ఎత్తు, మూడున్నర అడుగుల వెడల్పు ఉన్న ఈ అరుదైన అపురూప జైన విగ్రహం చుట్టూ గల రాతిని తొలగించడం మంచిది కాదని హెచ్చరించారు. ఇక మీదటైనా క్వారీ పనులను ఆపి, ఆ విగ్రహాన్ని కాపాడుకోవాలని నంగునూరు గ్రామ ప్రజలకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ క్షేత్ర పర్యటనలో అహోబిలం కరుణాకర్, పవన్, ప్రముఖ శిల్పి బి. సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.

20 నుంచి ఓపెన్ పరీక్షలు

● మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రాధాకిషన్ అధికారులకు సూచించారు. బుధవారం పరీక్షల నిర్వహణపై డీఈవో కార్యాలయంలో అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈనెల 20 నుంచి 26 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 459 మంది, ఇంటర్ పరీక్షలకు 876 మంది అభ్యాసకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పది పరీక్షల కోసం మెదక్, తూప్రాన్, నర్సాపూర్‌లో 3 కేంద్రాలు, ఇంటర్ కోసం మెదక్, నర్సాపూర్ 2 చొప్పున, తూప్రాన్‌లో ఒకటి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరగంట ముందుగాను చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు మినహాయింపు ఉందన్నారు. అభ్యర్థి హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, లేదా ఫోటో స్పష్టంగా కనిపించే గుర్తింపు కార్డు తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మత్స్య సొసైటీకి రక్షణ కల్పించండి : హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చేపల వేట సంబంధించి ఖాజీపూర్ ప్రాథమిక మత్స్య సహకార సంఘం సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్ భూంపల్లి మండలం ఖజీపూర్ పరిధిలోని పలు జలవనరుల్లో చేపలవేటకు జిల్లా మత్స్యశాఖ అధికారి తమకు హక్కులు కల్పించినప్పటికీ పలువురు అడ్డుకుంటున్నారని.. ఖాజీపూర్ మత్స్య సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదిస్తూ.. 1964 నాటి జీవో 98 ప్రకారం 29 కులాలకు మాత్రమే ఫిషింగ్ హక్కులు ఉంటాయని తెలిపారు. ప్రధానంగా ముదిరాజ్, ముత్తరాశి, తెనుగు, బెస్త, గంగపుత్ర, గూండ్ల వర్గాలు ఉన్నాయన్నారు. ఖాజీపూర్ మత్స్యకారుల సొసైటీకి జిల్లా మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికీ అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేద న్నారు. ఈ నేపథ్యంలో తమ హక్కులను, జీవనోపాధిని కాపాడాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం, పోలీసు, మత్స్యశాఖ అధికారులకు నోటీసులు జారీచేసింది. తగిన రక్షణ చర్యలు చేపట్టాలని దుబ్బాక సీఐ, భూంపల్లి ఎస్‌హెచ్‌వోకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 29కి వాయిదా పడింది.

పీఎస్‌ను తనిఖీ చేసిన సంగారెడ్డి ఎస్పీ

ఝరాసంగం, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన ఝరాసంగంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలను ఆయన పరిశీలించారు. అక్కడి రికార్డులను పరిశీలించి స్థానిక ఎస్ఐ నరేష్‌కు వాటిపై సలహాలు, సూచనలు అందజేశారు. శాంతి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు.

నీరు లేకుండా జీవుల మనుగడ అసాధ్యం

● డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య

చిన్నకోడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నీరు లేకుండా జీవుల మనుగడ అసాధ్యమని డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య పేర్కొన్నారు. బుధవారం చౌడారం గ్రామంలో పలు శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి వాటర్ షెడ్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ చేసి, మొక్కలు నాటారు. చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ, జ్యోతి ప్రజ్వలన చేసి, నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. జీవనోపాధుల కింద పలువురు నెలకొల్పిన యూనిట్ల ప్రదర్శన (స్టాల్స్)ను పరిశీలించారు. వాటర్ షెడ్ నిర్వహణకు సంబంధించిన వీడియోను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. నీటి ప్రాముఖ్యం, పొదుపు, తోటల పెంపకం, వాటర్ షెడ్ పథక ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ అందరూ నీటిని వాడే వాళ్లే కానీ, కాపాడేవాళ్లు చాలా అరుదుగా ఉంటారన్నారు. కందకాలు తవ్వడం, రాతి కట్టడాలు, చెక్ డ్యాం నిర్మాణంతో భూగర్భ జలాలను పెంచవచ్చునన్నారు. పిల్లలకు నీటిని సంరక్షించడం నేర్పించాలన్నారు. వాటర్ షెడ్ అభివృద్ధి పనులకు సహకరించిన 26 మందికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీపీవో రాధిక, అడిషనల్ డీఆర్డీఏ పీడీ బాలకిషన్, ఏపీడీ శ్రీనివాస్, వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి నూరొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



చికిత్స పొందుతున్న విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 16: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సమీకృత బాలికల వసతి గృహం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జిల్లాలో అన్ని రకాల 105 వసతి గృహాలు ఉన్నాయన్నారు. నాలుగు రోజుల క్రితం విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. సంఘటన జరిగిన రోజునే ఫుడ్ శాంపిల్స్ సేకరించమన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిని పద్మజ, సీహెచ్‌వో (కమ్యూనిటీ హెల్త్ అధికారి) ఎలిజబేత్ రాణి, డాక్టర్ ఫెర్నాండాజ్ , అసుపత్రి సూపర్ వైజర్ రమేష్, వార్డెన్ నర్సమ్మ ఉన్నారు.

న్యూస్ బాక్స్

డీఈవోకు సన్మానం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు, మూల్యాంకనాన్ని విజయవంతంగా నిర్వహించినందుకుగాను టీటీయూ సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీటీయూ రాష్ట్ర కార్యదర్శి మొగులయ్య, జిల్లా అధ్యక్షుడు పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సహాధ్యక్షుడు శంకర్, రాజు, కార్యదర్శులు రాములు, జగన్, అరుణ్, సాయి, దస్తగిరి, ముకుంద్, బస్వరాజ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈలు వెంకటేశ్వర్లు, రవీందర్ తెలిపారు. జిన్నారం, సోలక్‌పల్లి, శివానగర్ సబ్‌స్టేషన్లు సహా గుమ్మడిదల మండలవ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు.

అనాథ పిల్లల ఇంటిని సందర్శించిన అధికారులు

పాపన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి కుర్తివాడను డీడబ్ల్యూవో హైమావతి, డీసీపీవో కరుణశీల బుధవారం సందర్శించారు. గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లల ఇంటిని సందర్శించి విచారణ చేశారు. సంబంధీకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు పిల్లలు వసతి గృహాల్లో చదువుతున్నారని, వేసవి సెలవుల్లో వారికి ఆశ్రయం కల్పిస్తామన్నారు.

71వ రోజుకు దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల పరిధిలోని ప్యారానగర్, నల్లవల్లి ప్రాంతాల్లో డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 71వ రోజుకు చేరాయి. ఇందులో బొంతపల్లి సీజీఆర్ ట్రస్టు సభ్యులు కృష్ణ, సత్తారపు శ్రీకాంత్, భయానోళ్ల దాస్, కొలుకూరి పోచయ్య, ఉప్పరి ఏడుకొండలు కూర్చున్నారు.

దుర్గమ్మకు బోనాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి చెందిన అల్లాదుర్గం బేతాళస్వామి జాతరలో భాగంగా మూడవరోజైన బుధవారం పట్టణంలోని దుర్గమకు భక్తులు సమర్పించారు. బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా శిఖరోత్సవం

కంగ్టి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని సిద్ధేశ్వర జాతరలో భాగంగా బుధవారం స్వామివారి శిఖరోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా వెదురు కర్రలతో తయారు చేసిన భారీ శిఖరాన్ని అందంగా అలంకరించి భజనలు చేస్తూ ఊరేగించారు. అనంతరం తాళ్ల సహాయంతో 30 అడుగుల ఎత్తు గల రథంపై ప్రతిష్ఠించారు.

'సర్వే పకడ్బందీగా నిర్వహించాలి'

కోహీర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది రేషన్‌కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ బాలశంకర్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో కార్యదర్శులకు, రెవెన్యూ సిబ్బందికి రేషన్‌కార్డుల సర్వేపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను సమర్పించాలి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ఆ కాపీని ఎంపీపీ కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ఇప్పటివరకు 1,655 మంది రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం

అల్లాదుర్గం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు మరింత ఆర్థిక అభివృద్ధి చెందొచ్చని లివ్‌పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, అల్లాదుర్గం ఏఈవో అమృత్ సూచించారు. బుధవారం మండలంలోని ముస్లాపూర్ రైతువేదికలో పంటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు.

గుంతలు పూడ్చివేత

రేగోడు: రేగోడు మండలంలోని పోచారం, టి లింగంపల్లి, రాయిపల్లి వరకు ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఎట్టకేలకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చేశారు.

ప్రమాదబీమా పాలసీ చెక్కు అందజేత

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సక్రునాయక్‌తండాకు చెందిన మారుతి కొన్నినెలల క్రితం చనిపోయాడు. బుధవారం సంగారెడ్డి జిల్లా ఏజీఎం, రీజినల్ మేనేజర్ పింగళి సమత స్థానిక బ్యాంకు అధికారులతో కలిసి బాధిత కుటుంబసభ్యులకు సుమారు రూ.20 లక్షల ప్రమాదబీమా పాలసీ చెక్కును అందజేశారు.



యోగాసనాలకు కుటీరం



వాకింగ్‌ట్రాక్



చిన్నారులు ఆడుకోవడానికి పరికరాలు

పార్కుల అభివృద్ధికి చర్యలు

- యోగాసనాలకు కుటీరం ఏర్పాటు
- వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్
- పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం డివిజన్‌లో శ్రీనివాస్‌నగర్‌లో రూ.2.5 కోట్లు, మల్లికార్జున్‌నగర్‌లో రూ.కోటి, మయూరినగర్ రూ.51 లక్షలు, శ్రీసాయినగర్ కాలనీలో రూ.2.5 కోట్లు, కాకతీయనగర్ రూ.3.5 కోట్లు చొప్పున నిధులు వెచ్చించి ప్రత్యేకంగా పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. పార్కులు ఏర్పాటు చేయడానికి స్థలాలు కేటాయించడమే కాకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నారు. పార్కుల అభివృద్ధి విషయంలో ఉద్యానవనశాఖ, ఇంజనీరింగ్, కాలనీ సంఘాలతో కలిసి పార్కుల నిర్మాణాలు శాస్త్రీయ పద్ధతిలో చేపడుతున్నారు. పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 60 ఏళ్లు దాటిన పెద్దలు వ్యాయామం చేయడానికి చిన్నపాటి కుటీరం, వాకింగ్ నిర్మించారు. పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ అన్ని వయస్సుల వారు వాకింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారులు సైతం ఉదయం సాయంత్రం సమయాల్లో ఆడుకోవడానికి వీలుగా పరికరాలు అందుబాటులో ఉంచారు.

పార్కులతో ఆరోగ్యానికి చికిత్స



అన్ని కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేయాలని సంకల్పించాను. స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా సాధ్యమైనంత వరకు పార్కులు ఏర్పాటు చేసేట్టు చర్యలు తీసుకున్నాం.

\- పుష్పానగేష్, కార్పొరేటర్

రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దోపిడీ
- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



రామాయంపేటలో మాట్లాడుతున్న రోహిత్‌రావు

రామాయంపేట/జహీరాబాద్/మనూరు/మెదక్ కల్చరల్/రేగోడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలుజేశారని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం రామాయంపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటి బచావో-బేటి పడావో, పోషణ్ పక్వాడ' కార్యక్రమం గురువారం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఆర్డీవో రమాదేవి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, నాయకులు సరాఫ్ యాదగిరి, దేమే యాదగిరి, రమేష్‌రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణం బసవేశ్వర వీధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీవో అంజమ్మ ఆధ్వర్యంలో, మనూరు మండలం అతిమ్యాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. మెదక్ మండల పరిధిలోని రాయిన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో, రేగోడు మండలంలోని గజవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.

నీటి సమస్యపై అప్రమత్తతతో ఉండాలి

- అధికారులకు ఎమ్మెల్యే సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/వట్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత అధికంగా ఉండడానికి తోడు భూగర్భజలాలు తగ్గుతుండడంతో అధికారులు నీటి సమస్యపై అప్రమత్తతతో ఉండాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కొన్నిచోట్ల విద్యుత్ సమస్య తదితర కారణాలతో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలియడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని సక్రమంగా సరఫరా చేయించడం కోసం ప్రత్యేకంగా రూ.70 లక్షలతో డెడికేటెడ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించామన్నారు. దీంతో నీటి సరఫరాకు విద్యుత్ సరఫరా ఇబ్బంది ఉండదని, అందువల్ల అప్రమత్తతతో ఉండి నీటి సరఫరా సక్రమంగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం వట్‌పల్లి మండలం గొర్రెకల్‌లోని సబ్‌స్టేషన్‌లో రూ.70 లక్షలతో డెడికేటెడ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

70 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నా పట్టాలివ్వండి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కొంగోడ్ రైతుల ధర్నా

నర్సాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలం కొంగోడ్‌లో సర్వే నెంబరు 209లో 70 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవిస్తున్నామని, వాటికి పట్టాలిచ్చి న్యాయం చేయాలని రైతులు సీపీఎం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గతంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేయగా 2012లో సర్వేచేసి పట్టా పాసు పుస్తకాలు ఇస్తామని హామీఇచ్చారని, అయితే ఇంతవరకూ ఆ హామీ నెరవేర్చలేదన్నారు. సర్వే నెంబరు 209లో 93 ఎకరాల భూమి ఉండగా.. అందులో 110 కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కబ్జాలో ఉన్న రైతులకు పట్టాలిచ్చి న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీవో మహిపాల్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏసు, స్వామి, దుర్గయ్య, దాసు, మధు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమగ్ర వివరాలపై ఆరా

- రెండోరోజు కొనసాగిన సర్వే

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర వివరాల సేకరణకు విద్యాశాఖ చేపట్టిన సర్వే రెండోరోజు కొనసాగింది. యూడైస్ ప్లస్‌లో ఉన్న పాఠశాల సమగ్ర వివరాలను బీఈడీ, డీఈడీ విద్యార్థులు సరిపోల్చి చూశారు. తేడాలుంటే రిమార్కులు రాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 మంది బీఈడీ, డీఈడీ విద్యార్థులు సర్కారు బడుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్న విషయం తెలిసిందే. కాగా బుధవారం సంగారెడ్డిలోని నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలతో పాటు పలు ఉన్నత పాఠశాలలను బీఈడీ, డీఈడీ విద్యార్థులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ దత్తు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య

చిన్నశంకరంపేట/చేగుంట/మాసాయిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య ఉపాధిహామీ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పనులపై ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. సోషల్ ఆడిట్ రిపోర్టును ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏపీవో రాజ్‌కుమార్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే చేగుంట, మాసాయిపేట ఎంపీడీవో కార్యాలయాలను జడ్పీ సీఈవో ఎల్లయ్య సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్, ఏపీవో శ్వేత ఉన్నారు.

నేటి నుంచి వీరభద్రేశ్వర జాతర



రాయికోడ్‌లోని భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయం

రాయికోడ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాయికోడ్‌లో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర జాతర నేటి నుంచి 22 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సతీష్‌కులకర్ణి, ఆలయ ఈవో శివ రుద్రప్ప తెలిపారు. ఈ జాతరకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు తరలిరానున్నారు. 17న స్వామివారికి అభిషేకాలు, ధ్వజారోహణం, 18న అగ్నిగుండం పల్లకీసేవ, రథోత్సవం కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి బీరప్ప స్వామి బయలు నాటకం మొదటిభాగం, 19న సహస్ర బిల్వార్చన, వీరాంజనేయ స్వామిపూజ, 20న బిల్వార్చన కుంకుమార్చన, రాత్రి 9 గంటలకు బీరప్పస్వామి బయలు నాటకం రెండోభాగం, 21న స్వామివారి ఆకుల పూజ కుంకుమార్చన పూజలు, 22న బీరప్ప స్వామి బయలు నాటకం మూడో భాగం కొనసాగుతుందన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

రేడియల్ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ప్రహరీ తొలగించాలి: గ్రామస్థులు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధి ఈదులనాగుపల్లి గ్రామం రేడియల్ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ప్రహరీ పనులు నిలిపివేయాలని గ్రామస్థులు కోరారు. బుధవారం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రియల్ వ్యాపారి బహుళ అంతస్థుల భవనాలకు వ్యాపారం చేసుకోవడానికి వీలుగా రోడ్డుకు ఇరువైపులా ప్రహరీ నిర్మిస్తున్నారని తెలిపారు. తమ భూముల్లోకి రోడ్లను సైతం మూసివేసి ప్రహరీలు నిర్మిస్తున్నారని వివరించారు. స్పందించిన తహసీల్దార్ నిర్మాణం ఆపకపోతే చర్యలు తీసుకుంటామని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఫోన్‌చేసి చెప్పారు.

ధరల పట్టిక ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రైబజార్ ధరల పట్టిక ఏర్పాటు చేయకపోవడంతో వెజిటేబుల్ మార్కెట్‌లో రైబజార్ రుసుం అధికంగా వసూలు చేస్తున్నారన్న వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కమలాద్రి ఆదేశాల మేరకు కార్యదర్శి రమాదేవి చిరువ్యాపారులకు, రైతులకు, వ్యాపారులకు ఒక్కొక్క రేటును నిర్ణయించి ధరల పట్టికను ఏర్పాటు చేయించారు.

అజ్జమర్రిలో 'గావ్ చలో, బస్తీ చలో'

చిలప్‌చెడ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో బుధవారం 'గావ్ చలో, బస్తీ చలో' కార్యక్రమాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుంది

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
- పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వెల్దుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



రామచంద్రాపురం టౌన్ : ముత్తంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

చిన్నశంకరంపేట/పాపన్నపేట/వెల్దుర్తి/చిలప్‌చెడ్/రామచంద్రాపురం టౌన్/గుమ్మడిదల/చేగుంట/వట్‌పల్లి/జిన్నారం/నర్సాపూర్/ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. చిన్నశంకరంపేట పీఏసీఎస్, జంగరాయి పీఏసీఎస్ పరిధి గ్రామం గవ్వపల్లిలో ఆర్డీవో రమాదేవితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. పాపన్నపేట మండల పరిధి పొడ్చన్‌పల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ కొత్తపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రారంభించారు. వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తితో పాటు పలు గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను, చిలప్‌చెడ్ మండల పరిధిలోని సోమక్కపేట, సామ్లతండా, ఫైజాబాద్, అజ్జమర్రి, గంగారం బండా పోతుగల్, శిలాంపల్లి, చిలప్‌చెడ్ తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. తెల్లాపూర్ పురపాల పరిధి ముత్తంగి, లక్డారంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే గుమ్మడిదల మండలంలోని గుమ్మడిదల, కానుకుంట, రాంరెడ్డిబావి, అన్నారం, కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల్లో, చేగుంట మండల పరిధిలోని నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండా, నార్సింగి గ్రామాల్లో, వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లో పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, జిన్నారం మండలంలోని జిన్నారం, ఊట్ల గ్రామంలో ఐకేపీ ఏపీఎం నరేందర్ ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ అన్నారు. బుధవారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు.

గుంత తియ్యలే.. గుప్పెడు మట్టి పోయలే..!

5వ పేజీ తరువాయి

లబ్ధిదారులే బేస్‌మెంట్ లెవెల్ వరకు ఇంటి నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది కూలీ, నాలీ చేసుకుని బతికే వారే ఉండడంతో అంత డబ్బు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారు. పునాది స్థాయి వరకు నిర్మాణం పూర్తి చేసుకుని యాప్‌లో నమోదు చేసుకున్న వారికే రూ.లక్ష లబ్ధిదారుడి ఖాతాలో జమవుతాయని తెలుస్తోంది. దీని కోసం గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో ఇటీవల సమావేశం నిర్వహించారు.

రుణాలు ఇస్తేనే..

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతం కోసం పలు మార్గాలను అన్వేషించింది. స్వశక్తి సంఘాలలో సభ్యులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రుణాలు అందించాలని యోచిస్తోంది. ఇంటి నిర్మాణం ప్రారంభించడానికి అవసరమైన పునాది వ్యయం కోసం స్వశక్తి సంఘాల నుంచి లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. రుణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తప్పనిసరిగా స్వశక్తి సంఘంలో సభ్యులై ఉండాలని నిబంధన విధించింది. గ్రామైక్య సంఘం, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణం మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ రుణాలు ఇస్తే ఇంటి నిర్మాణాలు వేగవంతమయ్యే అవకాశం ఉన్నది.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఫెన్సింగ్



అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో రవీందర్‌రెడ్డి

అమీన్‌పూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. విలువైన ప్రభుత్వ భూముల కబ్జాలకు గురికాకుండా వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉన్న స్థలాలను గుర్తించాలని తహసీల్దార్ వెంకటస్వామిని ఆదేశించామన్నారు. భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పదేపదే ఆక్రమణలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీమాన్, రాఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంజీరా మరో మూసీనది

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం



మంజీరానది వద్ద ప్రజలతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పుల్‌కల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మంజీరా మరో మూసీనదిగా మారబోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం ఆందోళన వ్యక్తం చేశారు. చౌటకూర్ మండలం లింగంపల్లి గ్రామ సమీపంలోని మంజీరానది నక్కవాగు కాలుష్య జలాలతో నిండిపోవడంతో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. ముందుగా నదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, నక్కవాగుతో కలుషితమైన మంజీరా జలాలను పరిశీలించారు. అనంతరం అక్కడే గ్రామస్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ మంజీర నదికి గుదిబండగా మారిన నక్కవాగు కాలుష్య జలాలను రాకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. లింగంపల్లి గ్రామ శివారులో మంజీర నదిలో అడ్డంగా నిర్మించిన చెక్‌డ్యాంను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.సాయిలు, విద్యాసాగర్, రాజు, కృష్ణ, శ్రీహరి, సదానందం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో యానివల్ డే సంబరాలు

కొండాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని హరిదాస్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యస్థాయిలో సాధించిన ఘనతను సందర్భంగా నిర్వహకులు బుధవారం యానివల్ డే ఘనంగా నిర్వహించారు. పిల్లలు విద్యలో సాధించిన ఘనతను చాటి చెప్పేందుకు అబ్జర్వేషన్ బుక్స్‌అసిస్మెంట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేసి చిన్నారులకు మెడల్స్ వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, అంగన్‌వాడీ టీచర్ ఏసుమణి పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం పనులు ముమ్మరం



రేగోడులో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం

రేగోడు ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రేగోడులో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరుకావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో భవనం బేస్‌మెంట్‌ను రోడ్డు కంటే తక్కువ ఎత్తులో నిర్మించడంపై గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. రోడ్డు కంటే తక్కువ ఎత్తులో నిర్మిస్తే వర్షం నీళ్ల భవనంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, సీసీరోడ్డు కంటే రెండు ఫీట్లు ఎత్తులో నిర్మించాలన్నారు. బేస్‌మెంట్ స్థాయిలోనే భవనం ఎత్తు పెంచి నిర్మించాలని కోరుతున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు

- మెదక్ జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య

శివ్వంపేట/చిలప్‌చెడ్/వెల్దుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పశువులు, గేదెల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచిత టీకాలను వేస్తున్నదని మెదక్ జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేట, చెన్నాపూర్‌లో ఉచిత గాలికుంటు టీకాల పంపిణీని ప్రారంభించారు. మండల పశువైద్యాధికారులు సంధ్యారాణి, ప్రియాంక, ఓఎస్‌కీర్తి పాల్గొన్నారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని శిలాంపల్లి, చిట్కుల్ గ్రామాల్లోనూ గాలికుంటు నివారణ టీకాలను వెంకటయ్య ప్రారంభించారు. వెల్దుర్తిలో పశు వైద్యాధికారి రేఖరసజ్ఞ ప్రారంభించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

శివ్వంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్కుల గ్రామానికి చెందిన గుండె కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బంది పడుతున్న కుటుంబానికి తోటి మిత్రులు చేయూతనిచ్చారు. అందరూ కలిసి రూ.27 వేలను పోగుచేసి మృతుడి కుటుంబానికి అందజేశారు.

భూభారతిపై రైతులకు అవగాహనా సదస్సు

కొండాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు అవగహనా సదస్సును నిర్వహిస్తునట్లు తహసీల్దార్ అశోక్ బుధవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం మల్కాపూర్ పరిధిలోని గోకుల్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన భూభారతి పోర్టల్ విధివిధానాలపై అవగహన కల్పించినట్లు తెలిపారు.